క్లుప్తంగా

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుతో జోన్-8 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు

గోపాలపట్నం: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజారోగ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని జోన్-8 ఏఎంహెచ్‌వో జె. కృష్ణంరాజు చెప్పారు. ఇటీవల విధుల్లో చేరిన ఆయన సోమవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును గోపాలపట్నంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగ అధికారులు కేవీ రమణ, చిట్టి బాబు, గోపి, దమ్ము శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు



గోపాలపట్నంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

గోపాలపట్నం: జీవీఎంసీ జోన్-5, జోన్-8 ప్రాంతాల్లోని బస్ స్టాపుల వద్ద జీవీఎంసీ అధికారులు12 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవి తమ దాహార్తి తీరుస్తున్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీటి పక్కనే చలువ పందిళ్లు కూడా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే నాగిరెడ్డి అభినందన




జ్యోత్స్న ప్రియను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

మల్కాపురం: ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 560 మార్కులు సాధించి యారాడ జిల్లా పరిషత్ పాఠశాల టాపర్‌గా నిలిచిన జ్యోత్స్నప్రియను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు,యారాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై ఫిర్యాదు

మల్కాపురం: జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబ సభ్యులపై కర్ణాటకలో బీజేపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడడం దారుణమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్, దాకరపు నూకరాజు యాదవ్,ఎం.డి.రజియాభేగం డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటకలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు.దీన్ని జీర్ణించుకోలేక తమ పార్టీ నాయకులపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు.

అనారోగ్య బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



సూర్యనారాయణ (ఫైల్)

గోపాలపట్నం: అనారోగ్య బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ఆదర్శనగర్ రైల్వే ట్రాక్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపాలెం గణపతినగర్‌లో నివాసముంటున్న తెలగవలస సూర్యనారాయణ(55) అనారోగ్య కారణాలతో రైల్వే ట్రాక్‌పై బలవన్మరణానికి పాల్పడ్డాడు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆ బాధ తాళలేక ఆదివారం అర్ధరాత్రి సమయంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంలో తల,మొండెం వేరయింది. సూర్యనారాయణ స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి. బతుకు తెరువు కోసం నగరానికి వచ్చాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని జీఆర్‌పీ పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

ఆకర్షణీయం.. ఆహ్లాదం.. ఆరోగ్యం

- సుందరంగా వుడా లేఅవుట్ గ్రీన్ బెల్ట్



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న సందర్శకులు



విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న వాకింగ్ ట్రాక్

గోపాలపట్నం: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్టులు పిచ్చి మొక్కలతో నిండి ఉండేవి. వాటిని బాగు చేస్తూ వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. ప్రజల ఆదరణ పెరగడంతో మరింత మెరుగు పరిచారు. ట్రాక్‌లను అభివృద్ధిచేశారు. ఇది చూసిన వారు చాలా బాగుందంటూ ఆయా వార్డుల్లో ఉన్న గ్రీన్ బెల్టుల్లో ఇదే విధంగా వాకింగ్ ట్రాక్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వు డాలే అవుట్‌లోని గ్రీన్ బెల్ట్. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో నూతన ట్రాక్‌ల నిర్మాణానికి మోడల్‌గా నిలిచింది.

ఇదీ పరిస్థితి

మర్రిపాలెం వు డాలే అవుట్‌లోని గ్రీన్ బెల్ట్‌లో రెండేళ్ల కిందట వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఇప్పుడు దీన్ని మరింత అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దారు. మట్టితో వాకింగ్ ట్రాక్ మధ్యలో బెంచీలు, జిమ్ సామగ్రి, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అలాగే పార్కులోని బుద్ధుడి విగ్రహాన్ని హైలెట్ చేసేందుకు విద్యుత్ దీపాలు అమర్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవారికి ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ దీపాలు ఈ ప్రాంతానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పార్కు ఆహ్లాదంగా ఉండడంతో ఎక్కువ మంది వస్తున్నారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం ఇచ్చే విధంగా ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో వాకింగ్ చేస్తున్న ప్రజలు

రూ.26 లక్షలతో అభివృద్ధి పనులు

ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణతో పాటు పలు పనులకు జీవీఎంసీ నిధులు సుమారు రూ.9లక్షలు వెచ్చించారు. మోడల్ లైటింగ్‌కు రూ.17లక్షలు ఖర్చు చేశారు.

త్వరలో మరిన్ని హంగులు

దీంతో పాటు పరి కొన్ని పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.48.5లక్షలతో కాంపౌండ్ వాల్, మోడల్ ఫెన్సింగ్, వాచ్‌మెన్ గది, టాయిలెట్స్ వంటివి నిర్మించనున్నారు.

గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి కృషి



జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్టు అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ఉన్నాను. మర్రిపాలెం వెడాలేఅవుట్‌లో వాకింగ్ ట్రాక్ రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అలాగే ఎన్ఏడీ జంక్షన్ వరకు ఉన్న గ్రీన్ బెల్టులో కొన్ని ప్రాంతాలను గుర్తించాం. ప్రజలకు ఉపయోగపడే విధంగా, ఆహ్లాదాన్ని ఇచ్చేవిధంగా తీర్చిదిద్దుతాం.

జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 62వ వార్డులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్(1086343) సచివాలయ పరిధిలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్డు పరిధిలోని 300 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. మీ ఇంటి వద్దకే వచ్చాం..సమస్యలేమైనా ఉంటే చెప్పండి అంటూ ప్రజలను కోరారు. స్థానికుల ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ వాహనమిత్ర, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో ప్రయోజనం పొందామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి కూడా ప్రభుత్వ ప్రయోజనం అందించాలనే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ తొలేళ్లు

- నేడు ప్రధాన జాతర



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ



అమ్మవారి ప్రతిమలతో భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్ వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అమ్మవారి తొలిప్రతిమకు పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. సుమారు 65 అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ,అల్లిపురం, కాన్వెంట్ కూడలి,జ్ఞానాపురం,రామ్మూర్తిపంతులపేటమీదుగా ఊరేగించి కంచరపాలెంలోని సీతారామాలయం, సంపత్ వేంకటేశ్వరాలయం, ధనలక్ష్మి ఆలయాల ఆవరణలో నిలిపారు. అనంతరం తోటవీధిలోని పుట్ట బంగారం వద్దకు చేర్చారు. తొలేళ్ల ఉత్సవంలో నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రధాన జాతరనిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతా..



మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. వార్డు పరిధిలో కొనసాగుతున్న పనులపై సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అంబేడ్కర్‌నగర్‌లో సాయిబాబా ఆలయం వద్ద కాల్వ పనులతో పాటు జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. తొలుత సూచించిన విధంగా కాకుండా కొద్దిపాటి మార్పులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి కోసం జీవీఎంసీ నిధులు సుమారు రూ.6 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వార్డులో రహదారులు, కాల్వలు పార్కులు, శ్మశానవాటికలు అభివృద్ధి చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు అభినందనలు



పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సింథియా: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన గాంధీగ్రామం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు. పాఠశాలకు చెందిన నవశ్రీ (579), సుప్రియ(560), అనిషా(554) అత్యధిక మార్కులు సాధించడం తమకు గర్వంగా ఉందన్నారు. చదువుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: హెచ్‌పీ ఎల్‌పీజీ(గ్యాస్ కంపెనీ) బోటలింగ్ ప్లాంట్‌లో సోమవారం మృతి చెందిన జీవీఎంసీ 60వ వార్డు పవనపుత్ర కాలనీకి చెందిన పల్లా శ్రీధర్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమసమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. తన సొంత నిధులు రూ.2 లక్షలు శ్రీధర్ కుటుంబానికి అందిస్తానని ప్రకటించి తన ఉదారతను చాటుకున్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. పలువురు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి అజేయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు విజ్ఞానం అందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా పలు అంశాల్లో శిక్షణ పొందాలన్నారు. చిన్నారులకు చిత్రలేఖనం,దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల జీవిత చరిత్ర కథల రూపంలో వివరించటం,బొమ్మరిల్లు కథలు,గణితం,సైన్స్,తెలుగు పదాలు, ఇంగ్లిష్ బోధన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తరగతులు సాగుతాయి. కార్యక్రమంలో న్యాయవాది విశ్వనాథ్‌రాజు, రచయితలు సుంకర చలపతిరావు,బి.సత్యానందం,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..



వేసవి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, షిప్‌యార్డ్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ చంటి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులకు హాజరై సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి పక్కన ఉన్న గ్రంథాలయాన్ని పునర్నిర్మించేందుకు షిప్‌యార్డు యాజమాన్యంతో మాట్లాడారని.. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రరీ నిర్వాహకులు కనకరాజు, నాయకులు మీసాల సత్యనారాయణ, పెంట్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు



పెందుర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: ఈనెల 10న జరిగే పాలిసెట్-2023 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 10 గంటలకు ఎగ్జామ్ హాల్‌కు చేరుకోవాలని తెలియజేశారు. హాల్‌టికెట్లలోఎలాంటి తప్పులు ఉన్నా అభ్యర్థులు సరైన గుర్తింపుకార్డు చూపిస్తే పరీక్షకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డ్, స్కూల్ ఐడీ, విద్యార్థి సెల్ఫ్ డిక్లరేషన్, ఐడీ ప్రూఫ్ డాక్యుమెంట్లు తమ వెంట తీసుకు రావాలని సూచించారు. పత్రాలు పరిశీలించి పరీక్షకు అనుమతించడం జరుగుతుందన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న మృత దేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ సీతారామ్

గోపాలపట్నం: రైలు నుంచి జారి పడి ఎన్ఏడీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ కె. సీతారామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం నుంచి దువ్వాడ వెళ్లే రైల్వే ట్రాక్‌పై తల మొండెం వేరు పడి ఉన్న మృతుడి యవసు సుమారు 25 ఏళ్లు ఉంటుందని తెలిపారు. రాత్రి సమయంలో ట్రైన్‌లో ప్రయాణిస్తూ నిద్రలో జారి పడడంతో మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడు బెంగాలీ రాష్ట్రానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. మృతుడు ఆకు పచ్చ రంగు ట్రాక్, నేవీ బ్లూరంగు టీషర్ట్ వేసుకుని 5.8అడుగుల ఎత్తు చామన చాయ రంగుతో ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తిని గుర్తుపడితే జీఆర్‌పీ పోలీసులు 7673906010 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీలోని జయదుర్గా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన భారీ అన్న సమారాధనను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదు

సింహాచలం: ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి వెళ్లే వారికి సురక్షితమైన ప్రయాణం అందిస్తున్నామని సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు మాత్రమే సింహగిరికి పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. ఆ బస్సుల న్నింటీ ముందుగా పరిశీలించి ఫిట్ ఫర్ ఘాట్‌కు అనుకూలమైతేనే నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. గడిచిన ఆదివారం సింహగిరికి వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని స్పష్టం చేశారు. టోల్‌గేట్ దాటిన తర్వాత వచ్చే ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎగువకు ఎక్కుతున్న సమయంలో బస్సుకు కారు అడ్డుగా వచ్చిందన్నారు.ఈ లోగా బస్సుకు కారు మధ్యలోకి ద్విచక్ర వాహనదారుడు కూడా వచ్చేయడంతో డ్రైవర్ సమయ స్ఫూర్తితో కుడి వైపు తిప్పాడన్నారు. ఈ తరుణంలో బస్సు ఎదురు భాగం దెబ్బతిందన్నారు. ఆ తర్వాత చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా చూశాడన్నారు. వెనక్కి వెళ్లిన బస్సు రైలింగ్‌ను ఢీకొని నిలిచిందని తెలిపారు. ఈ సంఘటనలో బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని తెలియజేశారు.

ఏయూ విద్యార్థికి గుర్తింపు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సరం విద్యార్థి ఐ.రాణాప్రతాప్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాలలో భాగంగా శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని 'అమ్మ నా మాతృ భాష' కవితను రాణాప్రతాప్ వినిపించారు. అతడికి జాతీయ సాహిత్య పురస్కారం, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. అతడిని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు సోమవారం అభినందించారు.